క్లుప్తంగా

ప్రజా సమస్యలు పట్టించుకోకుండా పండగలా ?

పాపన్నపేట(మెదక్): ప్రజాసమస్యలు పట్టించుకోని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం ఏంటని మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ధాన్యం తూకం చేసి 15 రోజుల గడుస్తున్నా.. ఇంత వరకు డబ్బులు రాలేదన్నారు. ఓ వైపు వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ రైతుబంధు ఇవ్వలేదని విమర్శించారు. కొన్నిచోట్ల ధాన్యం ఇంత వరకు రైస్ మిల్లులకు చేరలేదన్నారు. రైతు పొట్ట గొడుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో బంగాళఖాతంలో కలపడం ఖాయమన్నారు.

నేడు రేగోడ్‌లో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద నేడు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని ఆ కార్యాలయ సీఈఓ హఫీజొద్దీన్ ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు.

కూచారంలో స్వచ్ఛభారత్

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యువత ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. 269వ వారంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం పిచ్చి మొక్కలను తొలగించి, చెత్త చెదారాన్ని డంప్‌యార్డులకు తరలించారు.

వైభవంగా నల్లపోచమ్మ బండ్ల ఊరేగింపు


మెదక్‌లో బండ్లను ఊరేగిస్తున్న దృశ్యం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని ఆటోనగర్‌లోని నల్లపోచమ్మ బండ్ల ఊరేగింపు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. డప్పుచప్పుళ్ల నడుమ శివసత్తుల సిగాలు, పోతురాజులతో బండ్ల ఊరేగింపు శోభాయమానంగా జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా పట్టణ పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


నిజాంపేట(మెదక్): నస్కల్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సిద్ధ రాములు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దివ్యాంగులకు రూ.1 వేయి పెన్షన్ పెంపు పై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగులు నాగరాజు, దేవరాజు, బాలయ్య, గ్రామస్తులు శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుప్రజా భాస్కర్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప, జిల్లా యువత బీఆర్ఎస్ పార్టీ యువత కార్యదర్శి భాస్కర్, ఉమ్మడి మెదక్ జిల్లా మైనారిటీ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి సలీం, చింతా రవి, సుధాకర్, మాణిక్యం, గోపాల్, కమ్మరి సిద్ధయ్య, సలొద్దీన్, దివ్యాంగులు, సజ్జత్, అమృత, కృష్ణ, ఈశ్వరయ్య, అన్నమీయ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


మైక్‌సెట్ అందజేస్తున్న జెడ్పీటీసీ

శివ్వంపేట(నర్సాపూర్): ఆలయాల అభివృద్ధికి తనవంతు సహాయం ఎల్లప్పుడు ఉంటుందని జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. మండల పరిధిలోని మల్లుపల్లి తండాలో సేవాలాల్ ఆలయ ఉత్సవాల సందర్భంగా రూ.25 వేల విలువ చేసే మైక్‌సెట్ ఆదివారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. అనంతరం శివ్వంపేటకు చెందిన వడ్ల శంకరప్ప ప్రమాదవశాత్తుకు కాలుకు గాయం కావడంతో చికిత్స కోసం రూ.8 వేల ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. శివ్వంపేటకు చెందిన విద్యార్థిని పూజశ్రీ ప్రభుత్వ రెసిడెన్షియల్ కాలేజీలో చదువుకొని 975 మార్కులు సాధించినందుకు గాను విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వెంకటేశ్, పోచగౌడ్, కల్లూరి రాజు, లక్ష్మీనర్సయ్య, కొండల్, ఖాదీర్, షేక్ ఆలీ తదితరులు ఉన్నారు.

ఇసుక మాఫియా జోరు


ఇసుక అక్రమ రవాణాపై మాట్లాడుతున్న మురళీయాదవ్


టిప్పర్లలోని ఇసుకను ఖాళీ చేయిస్తున్న దృశ్యం

- నర్సాపూర్ మున్సిపల్ ఛైర్మన్ మురళీ యాదవ్
- కొంగోడు హల్దీ వాగు ఇసుక రవాణాను అడ్డుకున్న బీజేపీ నాయకులు

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని హల్దీ వాగు నుంచి ప్రభుత్వ పెద్దల అండతోనే జోరుగా ఇసుక మాఫియా కొనసాగుతుందని నర్సాపూర్ మున్సిపల్ ఛైర్మన్ మురళీయాదవ్ ఆరోపించారు. శనివారం రాత్రి నుంచి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ వాల్దాస్ మల్లేశంగౌడ్, మండలాధ్యక్షుడు దయాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు మరి కొంతమంది రైతులతో కలిసి ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్లను అడ్డుకునేందుకు అక్కడే రాత్రంతా అక్కడే నిద్రించారు.

ఉదయం హల్దీ వాగును సందర్శించిన మురళీ యాదవ్ ఇసుక రవాణాను చేసేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్లను అడ్డుకొని, అందులోని ఇసుకను కాళీ చేయించారు. ఇసుక రవాణా కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అక్కడివారిని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని నచ్చచెప్పడంతో పాటు ఇసుక రవాణాకు వినియోగిస్తున్న టిప్పర్లను, హిటాచీలను నదిలో నుంచి పంపి వేయించారు.

- ఈ సందర్భంగా మురళీ యాదవ్, వాల్దాస్ మల్లేశం గౌడ్ మాట్లాడుతూ.. నర్సాపూర్ నియోజకవర్గంలో మట్టి, ఇసుక మాఫియా అధికార పార్టీ వారికి పండగల మారిందన్నారు.
- డబుల్ బెడ్రూంలు, తదితర అభివృద్ధి పథకాల పేర్లు చెప్పి ఇబ్బందిగా ఇసుక అక్రమ రవాణాకు ప్రభుత్వంలోని పెద్దలు ఇసుక అక్రమ వ్యాపారానికి తెరలేపారన్నారు. గతంలో ఇలాంటి అక్రమాలు ఎప్పుడూ జరగలేదని నియోజకవర్గంలోని ఖనిజ సంపదను అమ్ముకొని, జేబులు నింపుకోవడానికి అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు.
- హల్దీ వాగు సమీప గ్రామంలో సామాన్యులు నిర్మాణాలు చేపట్టేందుకు నది నుంచి ట్రాక్టర్ ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతించని అధికారులు, మూడు హిటాచీ 30 టిప్పర్లతో పగలు రాత్రి అనే తేడా లేకుండా హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారంటూ ఆరోపించారు.
- నది నుంచి ఇష్టారీతిగా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో భూగర్భ జలాలు అడుగంటి ఇక్కడి రైతులు పంటలు పండక తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొందన్నారు.
- ఇసుక రవాణాతో రోడ్లన్నీ ధ్వంసమై ప్రయాణానికి సైతం ఇబ్బందికరంగా తయారయ్యాయని, వాటిని బాగు చేయాలన్న విషయాన్ని మరిచి అక్రమ మార్గంలో సంపాదన లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.
- ఇప్పటికైనా అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్టు వేయకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట మండల పార్టీ అధ్యక్షుడు దయాకర్ గౌడ్, నాయకులు రాజేందర్, రాకేష్ నర్సింలు, సత్యనారాయణ అశోక్, వంజరి ఏగొండ, సజీవులు, రైతులు తదితరులు ఉన్నారు.

ఘనంగా అపూర్వ సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట ఉన్నత పాఠశాల 2020–21 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత ఆదివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 60 మంది విద్యార్థులు నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఐఆర్ఎస్‌కు ఎంపికైన సింగారపు మహేశ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులు సత్యనారాయణ, బిచ్చయ్య, వెంకట్‌రమణ, సుదర్శన్, మోహన్‌రాజు, ప్రభాకర్, రాజేశ్వరి, విఠలేశ్వర్, యాదగిరిలను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శివశంకర్, బాల్‌రాజ్, ప్రేం, వెంకట్,శివ, రఘు, శ్రీను, రవి, మల్లేశం, బాగేష్ పాల్గొన్నారు.

రూ.లక్ష సాయానికి దరఖాస్తు చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న గంగయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): చేతివృత్తి దారులకు ప్రభుత్వం అందించే రూ. లక్ష ఆర్థిక సహాయానికి కుమ్మరులు దరఖాస్తులు చేసుకోవాలని మండల కుమ్మరి సంఘం అధ్యక్షుడు కుమ్మరి గంగయ్య అన్నారు. ఆదివారం మండలం పరిధిలోని వెంకట్రావ్‌పేటలో కుమ్మరి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీ కులాలలోని చేతి వృత్తి దారులకు రూ. లక్ష ఆర్థిక సాయం చేయనుందన్నారు. దీంతో అర్హులైన కుమ్మరుగు దరఖాస్తు చేసుకోవాలాలన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ఎంబీసీ ఛైర్మన్ కుమ్మరి తాండూరు శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బాలకృష్ణతో పాటు జిల్లా నాయకులు వస్తున్నట్లు సంఘం సభ్యులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో మల్లేశం, వెంకటేశం, ప్రవీణ్, శ్రీనివాస్, నర్సింలు, విక్రమ్, దశరథ్, సత్యనారాయణ, దాసు, సాయిలు, మొగులయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

బీసీలకు ప్రభుత్వం సాయం అందించాలి


మనోహరాబాద్(తూప్రాన్): మాట్లాడుతున్న పద్మశాలీలు

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని బీసీ జాబితాలో ఉన్న 130 కులాలకు వర్తింపచేయాలని కాంగ్రెస్ నాయకుడు, మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు రూ.లక్ష సాయం ప్రకటించి కొందరికే పరిమితం చేయడం మిగతా బీసీ కులాలను విస్మరించడం అన్యాయమైన చర్య అన్నారు.

గౌడ కులస్తులకు రుణాలు అందించాలి

నిజాంపేట(మెదక్): బీసీ కులవృత్తులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న లక్ష రూపాయల రుణ పథకంలో గీత కార్మికులను చేర్చాలని మండల గౌడ యువజన అధ్యక్షుడు చిరంజీవిగౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రమాదాలతో కులవృత్తి నిర్వహించే మొదటి వర్గం గౌడ కులస్తులని, బీసీ సామాజిక వర్గంలో గౌడ కులస్తులు ఇప్పటి వరకు ఇలాంటి రుణ సంక్షేమ పథకాలు అందలేదన్నారు. ఇప్పటికైనా గౌడ కులస్తులకు గౌడబంధు పథకం వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.

పద్మశాలీలకు రుణం అందజేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వం బీసీలకు సైతం గ్రామాల్లో రుణాలు ఇవ్వడానికి కొన్ని కులాలకు మాత్రమే ఇస్తామన్నడం కరెక్ట్ కాదని, బీసీలో అన్ని వర్గాలతో పాటు పద్మశాలీలకు రుణం వర్తింపజేయాలని మండల పద్మశాలి అధ్యక్షుడు పుట్ట మహేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని పోతారంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీల్లో కొంత మందికి మాత్రమే రుణాలు ఇస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో నర్సింలు, కుమార్, వీరేందర్, నరేశ్, సత్తయ్య తదితరులున్నారు.

జైన్ మందిర్‌లో ఎమ్మెల్సీ పూజలు


ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని జైన్ మందిర్‌ను ఆదివారం మెదక్ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడికి ఆలయ అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు ఎమ్మెల్సీ నిర్వహించి, అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనకు నెలవుగా మండలంలోని జైన్ మందిర్ మారిందని, ఇక్కడి ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ కవి మల్లినాథ సూరి పేర సంస్కృత విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెంట ఆలయ కమిటీ ఛైర్మన్ సుమేర్ చంద్ పాండ్యా, ఎంఎసీ మాజీ డైరెక్టర్ రాజా గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ కుమార్, వెంకటేశం తదితరులు ఉన్నారు.

అకాల వర్షం


చిట్కుల్‌లో వర్షానికి తడిసిన ధాన్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని ఆయా గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం ఆదివారం రాత్రి కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వర్షంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిసి పోయింది.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తులతో రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్ పంతులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు మంచినీరు, వసతితో పాటు ఇబ్బందులు లేకుండా జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


చేగుంట(తూప్రాన్): పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని గోపని వెంకటాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మైసమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠాపనలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే హోమం కూడా చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని, ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ సువర్ణ అంజయ్య, వార్డు సభ్యులు సంగయ్య, కిష్టయ్య, నాయకులు మోహన్, రామాగౌడ్, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సాయిలు, మల్లయ్య, చంద్రయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం దేవతా మూర్తుల పుష్పాదివాస పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించి, మూర్తులను పుష్పాదివాసంలో ఉంచగా ఎమ్మెల్యే రఘునందన్‌రావు పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోమవారం రోజున విగ్రహ ప్రతిష్ఠ ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలను నిర్వహించనున్నట్లు అర్చకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో వేద పండితులు శ్రీధరాచార్యులు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు బాల్‌రెడ్డి, రాజగోపాల్ గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **రామాలయానికి స్థల విరాళం**



పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రం పెద్దశంకరంపేటలోని పురాతన రామాలయం పునర్నిర్మాణంలో భాగంగా ఆలయ ఆవరణలోని అర్చకుల స్థలాన్ని కొంత మేర విరాళంగా ఇచ్చారు. పేటలోని గుడి చంద్రశేఖరశర్మ, సంతోష్‌శర్మ, గుడి రామాచారిలకు చెందిన కొంత స్థలాన్ని ఆలయ కమిటీకి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళిపంతులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు కందుకూరి రవీందర్, అన్నారం సత్యనారాయణ, నర్సింలు, వెంకటేశం తదితరులున్నారు.

◆ **విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం**

చేగుంట(తూప్రాన్): మెరుగైన విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని చందాయిపేట గ్రామ నివాసి హైకోర్టు లాయర్ మీర్ అహ్మద్‌ఖాన్ అన్నారు. చందాయిపేటలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఎస్ఆర్ఐ లడ్డూ దొర, అడ్వకేట్ అహ్మద్‌ఖాన్‌లు నగదు అందించారు. గ్రామంలో 10/10 జీపీఏ సాధించిన సాయిరాంకు రూ.10 వేలు, 9.6 సాధించిన స్వాతి, నిఖితలకు రూ.5వేల చొప్పున, 9.3 సాధించిన నవ్యకు రూ.3వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వర్ణలతభాగ్యరాజ్, ఉపసర్పంచ్ సంతోష్, వార్డుమెంబర్లు శోభన్, రమ్యరవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా అడివయ్య**

టేక్మాల్(మెదక్): మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుర్తి మహేశ్‌రెడ్డి టేక్మాల్ మండల దనూర గ్రామానికి చెందిన అడివయ్యను మండల ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నట్లు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ... విద్యార్థుల సమస్యలపై పోరాడడానికి ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. ఎన్ఎస్‌యూఐ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియమకానికి సహకరించిన దామోదర్ రాజనర్సింహ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేశ్, జెడ్పీటీసీ సర్వాణి సరోజ మల్లేశం, పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కిషన్, మల్లారెడ్డి, సత్యనారాయణలకు ధన్యవాదములు తెలియజేశారు.

నేటి నుంచి హరిచంద్ తండాలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


హరిచంద్ తండాలో ముస్తాబైన ఆలయం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి హరిచంద్‌తండా పంచాయతీలో ఈనెల 12 నుంచి 14 వరకు శ్రీజగదాంబ, సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలకు ఆలయం ముస్తాబు అయినట్లు ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ లక్యానాయక్, తండావాసులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 12న గణపతి పూజ, స్వస్తి పుణ్యహవాచనం, దీక్షాధారణ, మంటప దేవతాహ్వానం, అగ్నిప్రతిష్ఠ, జలాధివాసము, 13న మంటపాధారణ, ధాన్య, శయ్య, ఫల, పుష్పాదివాసం, అన్నదానం, 14న జగదాంబ, సంత్ సేవాలాల్ మహారాజ్ యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

సీత్యా తండాకు నీటి సరఫరా


వాటర్‌ట్యాంకులోకి చేరుతున్న నీరు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి బిక్యా పంచాయతీ సీత్యా తండాలో తాగునీటి సమస్యపై తండా వాసులు శనివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసిన సంఘటన విదితమే. పైప్‌లైన్ సమస్య కారణంగా నీటిని ట్యాంకులోకి పంపింగ్ చేయడంలో తలెత్తిన సమస్యలను సిబ్బంది పరిష్కరించారు. ఆదివారం తండాలో ఉన్న వాటర్‌ట్యాంకులోని మంజీరా నీరు సరఫరా చేసినట్లు మిషన్ భగీరథ డీఈ ప్రవీణ్ చెప్పారు. ఇక నుంచి తండాలో నిత్యం మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుందని చెప్పారు.

2కే రన్‌ను విజయవంతం చేయాలి

మనోహరాబాద్(తూప్రాన్): రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ సందీప్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా తూప్రాన్ మండలంలోని పోతారాజ్ పల్లి కమాన్ నుంచి తూప్రాన్ బస్టాండ్ వరకు 2కే రన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలం నుంచి యువకులు, ఔత్సాహికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వర్గల్ క్షేత్రం సందర్శన

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రాన్ని ఆదివారం జెడ్పీ ఛైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్ సునితాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్‌రావు తదితర ప్రముఖులు సందర్శించారు. శంకరమఠం ప్రారంభోత్సవ వేడుక ల్లో పాల్గొన్న కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీవిజయేంద్ర సరస్వతీ ఆశీస్సులు పొందారు. వారికి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రశేఖరసిద్ధాంతి స్వామివారి సమక్షంలో జ్ఞాపికలు అందజేశారు.

17న మెగా జాబ్‌మేళా


జాబ్‌మేళా కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంజీవరెడ్డి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): దివంగత మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న నారాయణఖేడ్ నియోజకవర్గ కేంద్రంలో మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా ఈ ప్రాంతంలో ఉద్యోగాలు లేకపోవడంతో నిరుద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని దృష్టిలో ఉంచుకొని ఎస్సెస్సీ నుంచి పీజీ, డిప్లొమా, ఐటీఐ, ఎంటెక్, బీఈ, బీటెక్ చదివిన నిరుద్యోగులకు 60కి పైగా కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు 17 శనివారం నారాయణఖేడ్‌లోని మా ఫంక్షన్ హాల్‌లో ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్, సర్వీస్ సెక్టార్, కాల్‌సెంటర్, మాన్‌ఫ్యాక్చరింగ్ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు అర్హతల ఆధారంగా వేతనాలు అందిస్తాయన్నారు. నిరుద్యోగులు క్యూఆర్ కోడ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా వ్యక్తిగతంగా వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అభ్యర్థులు తమ ఒరిజినల్స్, జీరాక్స్ కాపీలను తీసుకొని రావాలని, ఎంపికైన వారికి వెంటనే అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, సర్పంచ్ అంజిరెడ్డి, ఎంపీటీసీ రాజునాయక్, నాయకులు వినోద్‌పాటిల్, మాజీ సర్పంచ్ సంగమేశ్వర్, రాజుపటేల్, సంగయ్య, రవీందర్, కుంట్ల శ్రీను, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.